


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -32-

**(27 ఫిబ్రవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ఉమర్ ఖయాం** రచించిన రుబాయత్‌ను ఇంగ్లీషులోకి తర్జుమా చేసి అఖండ కీర్తి సంపాదించాడు ఫిట్జి గెరాల్డు. అంత శృంగారం వేదాంతంగల గ్రంథాన్ని అనువదించడానికి పూనుకున్న మహనీయుడు ఎంత రసికుడో, ఎంత ప్రశాంత చిత్తుడో, ఎంత చతురుడో అయివుంటాడని భావించడం సహజం.

పాపం ఈ గుణాలన్నీ ఆయన కలానికి అంకిత మైనాయిగాని, ఆయన గృహస్థ్య జీవితంపైన చెప్పిన గుణసంపదలన్నింటికీ వ్యతిరేకంగా నడిచింది. అలాంటి పరిస్థితుల్లో కలం ఎలా చేత్తో పుచ్చుకున్నాడో ఆ గ్రంథం అంత చక్కగా ఎలా తయారు చేశాడో? ఈ విషయం ఆలోచిస్తే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. ఆశ్చర్యమేమిటి? అసలా ఫిట్జి గెరాల్డు ఇతడేనా అనిపిస్తుంది.

ఎంతో ప్రశాంతమైన వాతావరణం, స్థిరమైన మనస్సు, అహరహం అందుకునే సేవలు, మంచి ఆహారం, గొప్పగా లేకపోయినా కొద్ది కొద్ది భోగాలూ అనుభవించాలని కోరే కవులకు రచయితలకు పైన చెప్పిన వాటికి వ్యతిరేకమైన వాతావరణం ఏర్పడితే ఇక వారి సంగతి కాదు గతి. వేరే చెప్పక్కర్లేదు.

సరస్వతిని తలచుకుని "తల్లీ నువ్వు నా దగ్గిర కెందుకు వచ్చావమ్మా? నిన్ను నేనేం గౌరవించి పూజించగలనని? ఈ కల్లోలంలో, ఈ గంద్రగోళంలో ఇంట్లో పూట పూటకూ వచ్చిపడే భూకంపాలమధ్య ఇంపులూ సొంపులూ దిద్దుకునే కవిత్వం ఎలా కొనసాగిస్తాను తల్లీ. నన్ను క్షమించు. నీ ఆరాధనలో లోపం జరిగితే" అని వేడుకోవలసి వస్తుంది.

మిల్టనంతటి మహా రచయిత భార్యామణి వద్ద కలం క్రిందపెట్టి కర్తవ్యతా మూఢుడవుతూ వుండేవాడుట. "హే దేవీ నన్ను కొంచెం వ్రాసుకోనీ. దానికి సరస్వతీ కటాక్షం కన్న నీ కటాక్షం ఎక్కువ అవసరం. అనుగ్రహించు" అని వేడుకోవలసి వచ్చేదట.

పైగా ఆయనగారి జీవితంలో ఇంకో తమాషా ఏర్పడింది. ఒక భార్యతో బాధలుపడి, చెంపలు వేసుకుని వూరుకోలేదు. మళ్ళీ ఇంకో ఆవిణ్ణి తెచ్చుకోవడం అదే పద్ధతి బాధలు పడటం అలవాటైపోయిందట. ఇలా ముగ్గురిద్వారా ముప్పుతెచ్చుకున్నాడట.

మొదటి భార్య ఆయనతో ఎంతకాలం కాపురం చేసిందో తెలుసా? ఒక్క మాసం. మండలం కూడా కాదు. మిల్టన్ ఆవిణ్ణి చెప్పుచేతుల్లో పెట్టాలని చూశాడట. ఆవిడ చెప్పకుండా ఇంట్లోనుంచి పారిపోయిందిట. తిరిగి మరో తరుణీమణి.. మళ్ళీ అదే నాటకం. ఇలాటి ముగ్గురిచేత ఆయన అవమానించబడి - అనుభవం సంపాదించాడు. ఈ అనుభవంలో నుంచే మహా రచయిత అయినాడేమో? భార్యను పోగొట్టుకున్నప్పుడల్లా "చేయిజారినా స్వర్గం" అనుకునేవాడేమో?

రస్కిన్ మహాశయుని కథా అంతే. తల్లిదండ్రులు వెతికి వెతికి ఒక అందాల రామచిలుకను తెచ్చి కుమారుడికి పెళ్ళి చేశారుట. ఆ అమ్మాయి పేరు గ్రే. వియ్యంకులు బాల్యస్నేహితులుట. ఇద్దరి కుటుంబాల మధ్యా పూలవంతెన కట్టుకున్నామని ఉబ్బితబ్బిబ్బయిపోయారట.

వాళ్ళ సంతోషం సంగతి తర్వాత. దంపతుల సంగతి ఆలోచించాలిగా ముందు. వారు ఏ ఒక్క భావంలోనూ ఏకీభవించలేకపోయారుట. ఎంతో ప్రయత్నించి చూశాడుట ఆ మహా రచయిత. రచనలలో సారాన్ని రంగరించి పోశాడుట. కానీ ఏమీ ప్రయోజనం లేకపోయింది.

అయిదు సంవత్సరాల వరకూ ఈ ఆరాటాలూ, పోరాటాలూ కొనసాగినాయట. ఏనాడూ అన్యోన్యత, ఆనందం తొంగిచూడలేదుట. పోనీ దాగిలోలోపల దోబూచులాడుతున్నాయేమో, ఎప్పటికన్నా బయటపడతాయేమోనని అతడు ఆశతో ఎదురుచూశాడుట.

అయిదేళ్ళ తరువాత ఆత్మ పరీక్ష చేసుకుని ఎవరికివారు నిర్ణయించుకున్నారట. ఇది కుదిరే సంసారం కాదు. ఎన్నాళ్ళు బయటికిలా గొప్పలు చెప్పుకుని బ్రతకడం? తప్పుకుంటే మంచిది అని. అంతే. అక్కడితో జంట విడిపోయింది. "ఎవరికి వారే ఎమునా తీరే"గా గడిచినాయి శేషజీవితాలు.

మెరిడిత్ గొప్ప రచయిత. బ్రహ్మచారిగా వున్నంతకాలం ఎంతో హాయిగా కాలం గడిపాడు. మనస్సు ఎప్పుడూ నీలాకాశంలో గాలిపటంలా ఎగురుతూ వుండేదట. కాని, పెళ్ళి అంటే ఏదో ఆశ, సరదా ఉంటాయి? ఏ వన్నెల విసినకర్రో వచ్చి జీవితమంతా వెన్నెల కురిపిస్తుందనీ, దానిద్వారా తన రచనలకు విలువా, వెలుగూ వస్తాయని అతడెంతో ఆశపడ్డాడు.

కన్యకోసం అన్వేషణ ప్రారంభమైంది. పీకాక్ అనే ఒక రచయిత కుమార్తె కనిపించిందట. ఆవిడ చాలా అందగత్తె. అందులో ఒక రచయిత కుమార్తె. ఇంకేం తక్కువ అనుకున్నాడు. కవిత్వంలో జాబిల్లి వెన్నెల రంగరించి పోయవచ్చుననుకున్నాడు.

వెంటనే ఆవిణ్ణి చేసుకున్నాడు. ఇంటికి తీసుకు వచ్చాడు. వెంటనే తెలిసింది. ఆవిడతో కలిసి జీవించడం అంత తేలికకాదని. ఆ అందమైన శరీరంలో వెర్రివెన్నులు వేసిన మనస్సు వుందని అతనికేం తెలుసు పాపం. ఆ బుర్ర మెల్లమెల్లగా బటపడింది. ఆ పిచ్చి భావాల మధ్య కొంతకాలం పిల్లికూనలాగా పడివున్నాడు.

ఆవిడ దగ్గర ఎప్పుడూ మారని గుణం ఒక్కటే వుంది. అది గిల్లికజ్జాలకు దిగడం చెవులు గింగురుమనేలాగా వాగడం. ఎదుటివాళ్ళకు వెర్రి ఎత్తించి ఆ వేడుకననుభవించడం. పాపం భర్త గతి ఏం కావాలి?

రోజుకు పది గంటలు తీరికగా కూర్చుని ఒకరి నొకరు వెక్కిరించుకుంటూ, హేళన చేసుకుంటూ వుండేవారుట. ఆవిడ ఒకరోజు మోపిన నేరం మరో రోజు మోపకుండా పది సంవత్సరాలు ఆయనతో "హేళన యుద్ధం" సాగించిందట. అప్పటికి ఇద్దరిలో వోర్పూ, నేర్పూ హరించిపోయాయుట. మెరిడిత్ హతోస్మి అని పడిపోయాడట.

ఆయన సతీమణి ఒక కళాకారుని ప్రేమించి అతని చెయ్యి పుచ్చుకుని పయనించిందట ఆకాశపుటంచులదాకా.

ఎడిసన్ చిన్నతనంలో ఒక ధనవంతుని కుమార్తెకు ప్రయివేటు చెబుతూ వుండేవాడుట. అది క్రమంగా ప్రణయంగా మారిందట. అంతవరకు గురువు అనేభావంతో మెలిగిన పిల్ల ప్రియుడుగా మారిన తర్వాత వలపులు గుమ్మరించడం, సొగసులు దూసి పొయ్యడం వగైరా శృంగార భావాల్లోకి దిగిందట.

ఎడిసన్ అవి చూచి ఎంతో ఉప్పొంగిపోయాడు. పెళ్ళయింది. అమృతం దోసిళ్ళతో త్రాగుదామనుకున్నవాడు కడివెడు ఉప్పునీళ్ళు త్రాగుతున్నాను ప్రతినిత్యం అనిపించే స్థితిలో పడ్డాడుట.

కాపరానికి వచ్చినప్పటినుంచీ అతణ్ణి కాల్చుకు తినడమే ఆవిడ చేసే పని. దయాదాక్షిణ్యాలు లేవు. ప్రణయం చట్టుబండలూ అంతకన్నా లేవు. ప్రతిరోజూ అతడు కొంచెంసేపు చెంపలు వేసుకోవడం, తర్వాత తల బ్రద్దలుకొత్తుకోవడం తప్పలేదట పాపం.

ఇలా ఎందరో మహనీయులు 'ఇంటిపోరుతో' జీవితాన్ని కుంటుతూ, గెంటుతూ గడిపారు.

Post your comments